# పాడుదేవాలయం

## ౧

ఆ ముసలితాత రోజూ ఊళ్లోకి ముష్టికివచ్చేవాడు. ఎక్కణ్నుంచి వస్తున్నాడో ఎవళ్ళకి తెలియలే. పాట పాడడు "బిచ్చం వేయమ్మా" అనన్నా అనడు. ఏమీ మాట్లాడకుండా గుమ్మందగ్గిర నిలబడ్తాడు. పొమ్మంటే పోతాడు. పొమ్మన్నదాకా నవ్వైనా లేకుండా ఆ గుమ్మందగ్గిరే నుంచుంటాడు. ఊరంతా అడుక్కొని సాయింత్రిందాకా మావూళ్లో చెరువు గట్టుమీద కూర్చుంటాడు. ఎప్పుడైనా యిటు అటూ కదుల్తాడేమోగాని సాధారణంగా ఎల్లాకూచుంటాడో అలాగే వుంటాడు. ఆతనిగడ్డం మొక్కజొన్నకండెపీచులా తెల్లగా నెరిసిపోయింది. చిరిగిన పీలికలు కట్టుకున్నా అవి శుభ్రంగా వుంటాయి.

అతగాడి కళ్ళు మాత్రం ఆ తాత అంటే అందరికీ ప్రేమపుట్టుతుంది. వాటల్లో ఎంతో ఆపేక్షలు తిరిగిపోతూ వుంటాయి. ఆ తాత వుండగా బాధపడుతూన్న జంతువేదైనా కనబడితే లేచి తన సంచిలో నుంచి ఏవోవో గచ్చాకుపచ్చాకు తీసి కట్లు కడ్తాడు. అతను కట్లుకట్టిన జంతువులన్నీ రోగంపోయి ఆరోగ్యంగా వున్నాయన్నమాటే. చెరువుగట్టు మీద ఆ తాత కూచున్నప్పుడే రోగాలతో బాధపడుతున్న పశువుల తోలుకొని అక్కడకు చుట్టుపక్కల వూళ్ళవాళ్ళంతా వచ్చేవారు.

తిండిలేక మాడిపోయే అనేకమంది బీదవాళ్ళకి ఆతాత కుంచాలకొద్దీ బియ్యం ఇవ్వడం మేం ఎరుగుదుం.

తన బియ్యం ఎక్కడదాస్తాడో ఎక్కడపడుకుంటాడో వంటచేసే వాళ్ళు ఎవరైనా వున్నారో ఎవళ్ళకీ తెలవదు.

## ౨

ఒక రోజున నేనూ నా స్నేహితుడూ బయలుదేరి మావూరికు దక్షిణంగావున్న అడవిలోకి పోయాం, ఆ అడవిలో ఒక పాడుదేవాలయం వుందని నాకు తెలుసును. ముళ్ళకొంకలు పల్లేరు చిట్టడవి దాటి గుడిలో పడ్డాం. అక్కడ అన్నీ ఇటికెలే ఉట్టిగోడలు మధ్య అసలుగుడితప్ప ఇంకేమీ లేవు. నాలుగైదు విగ్రహాలుంటే అవన్నీ మావూళ్లో కొత్తగా కట్టించిన గుళ్లోకి తీసికెళ్ళారు కాని ఇంకా అక్కడ ఎన్నో రాళ్ళస్థంభాలు శాసనాలు చెక్కిన రాళ్ళు వున్నాయి. విరిగిపోయిన విగ్రహాలు చెక్కడాలు చాలావున్నాయి. అందుకనే పురాతన శిల్ప పరిశోధక సంఘమువారు "ఇక్కడుండే వస్తువులు ఒక్కటీ ముట్టుకో కూడదని" గవర్నమెంటువుత్తరువు ఒక బల్లమీద రాయించి అక్కడ పాతేయించారు. ఆగుడి చాలా పెద్దది. ఆ చిత్రాలన్నీ చూపిస్తూ నాకు తెలిసిన ఆ పాడు దేవాలయగాధ ఏవేవిటో మా స్నేహితుడికి చెపుతూంటే సాయంత్రమైంది.

సప్తమినాటి చంద్రుడు బాగా కాంతులు చిమ్మాడు. ఆ వెన్నెల్లో ఆ పాడుదేవాలయం మాకు చాలా అందంగా కనబడింది.

# 3

ఇంతల్లో ఒకగంట వినబడింది. ఇద్దరం హడిలిపోయాము. ఆ అడివిలో ఖంగు ఖంగుమని గంటెక్కణ్ణుంచి వచ్చింది. ఎద్దులగంటేమో అని అనుకుని దేవతలు దెయ్యాలు జ్ఞాపకంవచ్చి ఇఖ యిక్కడ వుండకూడదని అనుకుంటూ ఆగోడలన్నీ దాటి బయటపడ్డాం. ఇంటికి వెడదామని, దారి పట్టాం. చటుక్కున మళ్ళీ వినపించిదయ్యా ఆ గంట! ఈపట్టు గణ్ణంగా చేస్పష్టంగా మాకు వినుపించింది. ఒకళ్ళ మొఖాలు ఒకళ్ళు చూసుకొన్నాం. తప్పకుండా ఇది ఏవిటో — అనే అనుకున్నాం.

గబ గబ దారిలోకివచ్చి నిలిచాం. అయినా ఆస్థలం వదల్లేక అక్కడే నిల్చొని చెవియిచ్చివినడం ఆరంభించాం, మాకు మంచిస్థాయిలో పాటలు వినిపించడం ప్రారంభించాయి. ఏమయితే అయింది. ఇంగ్లీషు చదువుకున్నాం మా నిఘంటువుల్లో పిశాచాలు లేవు మనకిమాత్రం భయం ఎందుకురా! తెల్లవాడైతే భయపడ్తాడా? పదంటే పదనుకొని ఇటూ అటూ చూస్తూ నెమ్మదిగా ఆ పాడుగుళ్లో ప్రవేశించాం. గర్భగుడి ముందరికివెళ్ళాం. అక్కడ మాకు నీడల పంపిస్తూ అఖండంలాంటి దీపం కనబడింది. ఇది కొరివిదెయ్యం కాదుగదా అనిపించింది.

గర్భగుడి మొదటి గుమ్మందాటేటప్పటికి పూర్వ విగ్రహంవుండే పీఠాని కెదురుగుండా పూజచేస్తూ ఒక మనుష్యరూపం కనిపించింది లోపలి. గుమ్మందాటి వెళ్ళాం

అక్కడే మాకు కలిగిన ఆశ్చర్యం ఏవిటంటే; మా వూళ్లో ముష్టెత్తుకొనే ముసలితాతే అక్కడ పూజ చేస్తున్నాడు. స్పష్టంగా ఏమీ శబ్దస్వ

రదోషాలు లేకుండా సంస్కృత మంత్రాలు మహా ప్రవాహంలా ఉచ్చరిస్తున్నాడు. స్తంభాల్లా అలాగే నిలబడ్డాం ఇద్దరమూ. ఆ విగ్రహంలేని ఆపీఠానికే పువ్వులతో పూజ చేశాడు. హారతి ఇచ్చాడు, నైవేద్యం పెట్టాడు.

## ౪

అందాకా అలాగే నిలబడ్డ మమ్మల్ని చూసి లేవగానే మాకా పువ్వులు ఇచ్చాడు. తలవంచుకొని ఆ ప్రసాదం శిరస్సుమీద వుంచుకున్నాం.

నేను : ఎవరు నువ్వు. ఇక్కడేనా ఏమిటి నువ్వు వుండటం. ముసలి తాత మాట్లాడలేదు.

నా స్నేహితుడు : అయ్యా ఎన్నాళ్ళనుంచి పూజ చేస్తున్నారండి మీరు.

ఆ ముసలిభక్తుడు బ్రాహ్మణుడని కనిపెట్టాడు మావాడు.

మా యిద్దరికేసి ఒక పదినిముషాలు చూసాడా తాత.

ఆ చూపుల్లో ఏమీ కోపంలేదు.

ఇద్దరం ఎందుకో ఆయనకి నమస్కారాలు చేసాం.

కూచోమని సైగచేసి మేంకూచున్న తరువాత అక్కడే పద్మాసనం వేసి కూచున్నాడు మా ముసలితాత.

“నా పూర్వీకులు ఈ దేవాలయానికి పూజార్లు. ఎన్ని శతాబ్దాల నుంచి మాకుటుంబం తరతరంగా ఈదేవుడికి నిత్యనైవేద్యాది పూజలు చేస్తోందో నాకు తెలవదు. చెడుకాలమున ఈగుడి పాడైపోయింది. ఈ గుడి చుట్టూ ఒక పెద్దపట్టణం వుండేది. ఆ సంగతి మీకు తెలుసుననుకుంటా?

ఆ పట్నం దానికితోడుగా ఈగుడీ పాడైపోయిన తర్వాత మా పూర్వీకుల కుటుంబం ఈ సమీపాన్నే ఒక పూరిల్లు వేసుకొన్ని దేవుడికి నైవేద్యాలు, పూజలు నిత్యంగా జరుపుతోండేవారు. చుట్టుపక్కల వూళ్ళవాళ్ళు ఏడాదికొకమాటు ఇక్కడ ఒక తిరునాళ్ళు వుత్సవం చేసేవారు. అల్లా నాలుగైదు తరాలు పోయేటప్పటికి నిమ్మదిగా అ తిరునాళ్ళు మాయమయ్యాయి...... మా పూర్వీకుల కుటుంబం ఇక్కణ్ణుంచిపోయి ఇక్కడి పదిమైళ్ళలోవున్న......గ్రామం వెళ్ళారు. నున్వోగుగుదువా వూరు. కాని వారు ప్రతిఏకాదశికి వచ్చి ఇక్కడ పూజలు చేసేవారు. రాను రాను మాముత్తాత గారి కాలంవచ్చేటప్పటికి ఆయన కుటుంబంతో ఏడాదికి వకసారి ఆ తిరునాళ్ళరోజులకిమాత్రంఇక్కడకువచ్చి మూడురోలులు పూజలుచేసేవెళ్ళిపోయేవాడు. అల్లాగే మాతాతగారు మా నాన్నగారు విధికృతంగా పూజలు చేసేవాళ్ళు.

“ నేను బియే చదువుతూండగా నా తండ్రిగారు పోయారు. చచ్చిపోయేటప్పుడు నన్ను పిలిచి ఏదో చెప్పాలని అనేకమాట్లనుకొని వ్మళ్ళీ మానేస్తూచివరకు ప్రాణంపోయే సమయంలో నన్ను దగ్గరకు పిలిచి అస్పష్టంగా నాలుగుమాటలాడి ప్రాణం వదిలాడు.

“ నేను గుడిమాటే మరిచా. ఏభైఐదేళ్ళదాకా గవర్నమెంటు వుద్యోగాలు చేసా. చివరకు డిప్యూటికలెక్టరు పనిచేస్తూ పిన్షను పుచ్చుకొన్నా. ఆ వుద్యోగాలు చేసే రోజుల్లో అ తిరునాళ్ళరోజుల్లో వైద్యులు చెప్పలేకోలేని రోగం వచ్చేది పెన్షను పుచ్చుకొని మావూరు వచ్చాను. పూజలు పునస్కారాలు ఎన్నిచేసినా, ఎన్నితీర్థయాత్రలుసలిపినా నాకు ఒక

విధమైన మనో చాంచల్యము కలిగింది. మా చుట్టాలు మతి పోతుందనుకున్నారు.

" ఇప్పటికి నాలుగేళ్ళకిత్రము మా కిక్కడవున్న దేవాలయం బాపతు వచ్చిన పొలాలు చూడడానికి ఈవూరు వచ్చాను। ఆ సమయంలో ఈగుడి చూశాను

" గుళ్లో అడుగుపెట్టానో లేదో ఏదో రాయితగిలి కళ్ళుతిరిగి పడిపోయాను. అప్పుడు ఏమిచెప్పను ! ఈగుడిఅంతా కల కలలాడిపోయింది. అన్ని వెండి దీపస్తంభాలలో ఆవునేయిదీపాలు, గంటలు ధూపాలు. బంగారువిగ్రహాలు కనబడ్డాయి "వత్సా—ఎన్నివత్సరాలు పూజలు లేక వుండనయ్యా" అని స్పష్టముగా వినబడ్డాయి మాటలు !

" అప్పటినుంచి నా ఆస్థి దానధర్మాదులు చేసాను కొంత నాదూరపుచుట్టాలకు ఇచ్చాను. నా కుమారుడు చెన్నపట్నంలో చదువుతున్నాడు. అతనికి కొంతఆస్థి ఇచ్చాను ఇక్కడకువచ్చి ఈవిధంగా వుంటున్నా! "

ఆభక్తుడు మానివేశాడు. మేం బయటకువచ్చాం మా ఆత్మలు అద్భుతానందంలో నిండాయి! దేశమంతా వెన్నెల నిండింది.